క్లుప్తంగా

ఇంటర్ మహిళా కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

● ఎంపీసీ, బైపీసీ విభాగంలో 80 సీట్లు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను అధికారులు ఆహ్వానిస్తున్నారు. ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మొత్తం 80 సీట్లు కేటాయించారు. ఇంటర్‌లో ప్రవేశంతో పాటు సమీపంలోని వసతి గృహాల్లో నేరుగా సదుపాయం కల్పిస్తున్నారు. ఈ మేరకు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.శోభారాణి ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాల నుంచి ఇటీవల 124 మంది విద్యార్థినులు పదో తరగతి ఉత్తీర్ణులయ్యారు. ఆయా విద్యార్థినుల్లో కొంత మందికి బాలికల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించే విధంగా వారి తల్లిదండ్రులతో చర్చిస్తున్నారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభించనున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత నౌపడ


ట్రోఫీతో నౌపడ జట్టు సభ్యులు

సంతబొమ్మాళి: నౌపడలో జరిగిన జిల్లాస్థాయి బొంగు రాజారెడ్డి సార్మక క్రికెట్ ట్రోఫీ పోటీలు ముగిశాయి. విజేతగా నౌపడ జట్టు నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్‌లో నౌపడ, ఎం.సున్నాపల్లి జట్లు తలపడ్డాయి. మొదటి బ్యాటింగ్ చేసిన నౌపడ జట్టు 92 పరుగులు చేయగా తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఎం.సున్నాపల్లి జట్టు 80 పరుగులు మాత్రమే చేసింది. విన్నర్ జట్టుకు రూ. 20 వేలు, రన్నర్ టీంకు రూ. 15 వేలు నగదు బహుమతులను హర్ష, హర్షిత చేతులు మీదుగా అందజేశారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి


మాట్లాడుతున్న తేజేశ్వరరావు

కాశీబుగ్గ: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కోకన్వీనర్ లోపింటి తేజేశ్వరరావు అన్నారు. పలాసలోని సంఘ కార్యాలయంలో నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 25వ తేదీన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగా జిల్లాకు రానున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు ఉర్జాన అప్పలరాజు, శంబాన రామారావు, ఎల్ భాస్కరరావు, మీల జోగారావు, పత్తి బాబ్జీ, రోకల అప్పారావు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


కోటబొమ్మాళి: చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడులో సర్పంచ్ నేతింటి అప్పలస్వామి పర్యవేక్షణలో మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పూడికలు తొలగించారు. అలాగే చీపుర్లపాడు, దుర్గంపేట, వరహాలమ్మపేట గ్రామాల్లో కూడా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు.

వైభవంగా తాటిపోలమ్మతల్లి ఉత్సవం


ముర్రాటలతో వెళ్తున్న మహిళలు

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ పరిధి గోపీనాథపురం గ్రామదేవత తాటిపోలమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. మహిళలు ఘటాలు, ముర్రాటలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి చల్లదనం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడేళ్ల తరువాత ఉత్సవం జరగడంతో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది.

తక్షణ సాయం అందజేత


సాయాన్ని అందజేస్తున్న రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి 12వ వార్డుకి చెందిన నర్తు పాపామ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుమార్తె సుజాతకి వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయంగా రూ. 10 వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని మునిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి మంగళవారం అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బుడ్డెపు త్రినాథ్, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

నందిగాం: స్థానిక దిగువ బీసీ కాలనీలో ఉన్న సామాలమ్మ ఆలయ నాలుగో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. పురోహితులు రేజేటి బోసుబాబు, మేడేపల్లి రమేష్‌లు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు.

ఆడపడుచులకు అండ 'వైఎస్సార్ ఆసరా'

● చిరు వ్యాపారాలతో ఆర్థికాభివృద్ధి
● పలాస మండలంలో 1092 డ్వాక్రా గ్రూపులు


రెంటికోటలోని సాహుకారి ధనలక్ష్మి పాన్‌షాప్

పలాస: మహిళా సంక్షేమానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోంది. వివిధ పథకాలను వర్తింపజేస్తూ ఆర్థికాభివృద్ధికి ఆసరాగా నిలుస్తోంది. ఒకప్పుడు పూట గడవడమే కష్టంగా ఉండేది. రెక్కాడితే గాని డొక్కాడేది కాదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలతో ఇప్పుడు మగువల జీవితాల్లో మార్పులు కనిపిస్తున్నాయి. చిరువ్యాపారాలతో వారి జీవితాలు చిగురిస్తున్నాయి. ప్రధానంగా వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు అండగా నిలుస్తోంది. పలాస మండలంలోని వివిధ గ్రామాల్లో 1092 డ్వాక్రా సంఘాలు ఉండగా.. 12,302 మంది సభ్యులు ఉన్నారు. వీరికి వివిధ బ్యాంకు లింకేజీల ద్వారా ఈ ఏడాది రూ. 35 కోట్లు రుణాలను ప్రభుత్వం అందజేసింది. అంతే కాకుండా స్త్రీ నిధి నుంచి రూ.6 కోట్లు, వైస్సార్ ఆసరా ద్వారా మరో రూ.15 కోట్లు నిధులు అందాయి. ఈ విధంగా గత నాలుగేళ్లలో ఈ సంఘాలకు మొత్తం రూ.216 కోట్లు అందాయి. వీటిని ఆయా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. చిన్న చిన్న వ్యాపారాలకు పెట్టుబడులు పెడుతున్నారు. ఇంటి వద్దనే చక్కగా వ్యాపారం చేసుకొని జీవితాలు గడుపుతున్నారు. మరి కొంతమంది పాడి ఆవులు, మేకలు కొని పాలను విక్రయిస్తున్నారు. దీంతో గ్రామీణ మహిళల జీవితాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. వివిధ డెయిరీలకు పాలను విక్రయిస్తూ పాడి పరిశ్రమాభివృద్ధికి తోడ్పడుతున్నారు.

సంఘంలో చేరకముందు..

రెంటికోట గ్రామానికి చెందిన సాహుకారి ధనలక్ష్మి నిరుపేద. ఈమెకు ఇద్దరు పిల్లలు, భర్త, అత్త ఉన్నారు. పదో తరగతి వరకు చదువుకున్నారు. రేకుల ఇంటిలో ఉంటూ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు దంపతులిద్దరూ వెళ్లి నెలకి రూ.5 వేలు సంపాదించేవారు. అత్తకు అనారోగ్యం కావడంతో ఆమెకు నెలకు మందుల కోసం వెయ్యి రూపాయలు ఖర్చయ్యేవి. దీంతో ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. గ్రామంలో ఉన్న వీవోఏ, క్లస్టర్ కోఆర్డినేటరు ఆమెను సంఘంలో చేరమని మోటివేషన్ చేశారు. నెలకు రూ.50 పొదుపు చేసేలా అవగాహన కల్పించారు.

సంఘంలో చేరిన తర్వాత ..

సంఘంలో చేరిన తర్వాత ఈమెకు చాలా మేలు కలిగింది. 2020లో సీఐఎఫ్ రుణం రూ.50 వేలు తీసుకొని చిన్న పాన్ షాప్ పెట్టుకున్నారు. రోజుకు రూ.400 వ్యాపారం జరిగేది. ఖర్చులు పోగా రూ.200 మిగిలేది. ఈ విధంగా నెలకు రూ.6 వేలు సంపాదించేవారు. ఆ మరుసటి ఏడాది బ్యాంకు ద్వారా రూ.40 వేలు రుణం తీసుకున్నారు. ఈ డబ్బులు కూడా వ్యాపారంలో పెట్టారు. ఇప్పుడు నెలకు రూ.10 వేల వరకూ ఆదాయం సమకూరుతుండడంతో కుటుంబం హాయిగా గడుస్తోందని ఆమె ఆనందం వ్యక్తం చేస్తోంది. ఇలాగే చాలామంది మహిళలు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా లబ్ధిపొందారు.

నాలుగేళ్లలో రూ.216 కోట్లు లబ్ధి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో పలాస మండలంలోని డ్వాక్రా సంఘాల సభ్యులు రూ.216 కోట్లు లబ్ధి పొందారు. మహిళలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నారు. అనేక రకాలైన జీవనోపాధులను పొందుతున్నారు. మహిళా సాధికారిత సాధించి ఆనందమైన జీవితాలను గడుపుతున్నారు.

బి.మల్లేశ్వరరావు,
ఏపీఎం, వైస్సార్ క్రాంతి పథం,పలాస

ప్రజలు మనసు గెలుచుకున్న ప్రభుత్వం

● సమన్వయకర్త పిరియా సాయిరాజ్


కేక్ కట్ చేస్తున్న సాయిరాజ్

సోంపేట: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మనసు గెలుచుకుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ చరిత్ర లిఖించిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ విజయం సాధించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం కొర్లాం గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు పెట్టుకున్న నమ్మకంతోనే విజయాన్ని అందించారన్నారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే రికార్డు సృష్టించారన్నారు. ప్రభుత్వ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు.

గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

అనంతరం కొర్లాం గ్రామంలోనే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సాయిరాజ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని వివరించారు. నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమాల్లో సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన దుక్క లోకేశ్వరరెడ్డి, ఇచ్ఛాపురం, కంచిలి ఏఎంసీ చైర్మన్లు ఎన్.బాబూరావు, బత కల మోహనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, పార్టీ నాయకులు తామాడ మోహన్, బీన ఢిల్లీరావు, పొందూరు గున్నయ్య, జి.ధర్మారావు, అమర లోకనాథం, బంగారు పాపారావు, బత్తిని బాలరాజు, తులసీరావు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా నీటి సరఫరా


పంప్ హౌస్‌ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: ప్రజలకు మంచినీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవలసిన బాధ్యత అధికారులపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. పట్టణానికి నీటిని సరఫరా చేసే పంప్‌హౌస్‌లో మరమ్మతులకు గురైన రెండు మోటార్లకు సామగ్రిని అత్యవసరంగా కొనుగోలుచేయించి బాగు చేయించారు. ఈ నేపథ్యంలో పంప్ హౌస్‌ని మంగళవారం ఆమె పరిశీలించారు. నీటి సరఫరాకు ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, ఏఈ కామేష్ ఉన్నారు.

స్వేచ్ఛావతి అమ్మవారికి పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న రామారావు దంపతులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారిని భక్తులు మంగళవారం దర్శించుకొని పూజలు చేశారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఉన్నారు.

గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభం

కంచిలి: జాడుపూడి గ్రామదేవత కాశీమాత దుర్గాదేవి ఉత్సవాలు సోమవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. గ్రామదేవతను గుడి నుంచి గ్రామంలోకి ఊరేగింపుగా తీసుకొచ్చారు. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు

● మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు


వంశధార అధికారులను ప్రశ్నిస్తున్న ప్రత్యేక ఆహ్వానితుడు ఉదయ్‌కుమార్

వజ్రపుకొత్తూరు రూరల్: అధికారుల పని తీరు సక్రమంగా లేకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మోట్టూరు ఎంపీటీసీ సభ్యురాలు కొండప్ప సురేఖ మాట్లాడుతూ.. 80 కేజీల జీడి పిక్కల ధర రూ.8 వేలు కుడా పలకడం లేదన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు ప్రత్యేక చొరవ తీసుకొని ఉద్దాన రైతులను ఆదుకోవాలని కోరారు. మండల ప్రత్యేక అహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పొల్లాడ సర్పంచ్ గోపిలు మాట్లాడుతూ.. వంశధార అధికారుల నిర్లక్ష్యంతో శివారు ఆయకట్టుకు సాగు నీరు అందటం లేదన్నారు. ఇప్పటికే కాలువల్లో పూడిక తీతలు చేసి మరమ్మతులు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ ప్రక్రియ జరగలేదన్నారు. ఖరీఫ్ సీజన్‌కు కావల్సిన విత్తనాలు, పురుగు మందులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయని ఏవోకిరణ్‌వాణి తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు, గోర్జిలు అభివృద్ధి చేయాలని ఏపీవో కేశవరావును సర్పంచ్‌లు ధర్మారావు, పద్మావతి, గోపిలు కోరారు. సమావేశంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి, వైస్ ఎంపీపీ వంక రాజు, విప్ తిర్రి గుణ పాల్గొన్నారు.

వలంటీర్లకు పురస్కారాల ప్రదానం


పలాస: సత్కారం పొందిన వలంటీర్లు


కోటబొమ్మాళి: కొత్తపల్లిలో సత్కారం పొందిన వలంటీర్లు


పలాస: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా బొడ్డపాడు సచివాలయం పరిధిలోని గ్రామ వలంటీర్లకు మంగళవారం సేవా మిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. పంచాయతీ కార్యదర్శి మీనాకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 17 మందికి పురస్కారాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు, బుడత ధనరాజు, సరోజవర్మ పాల్గొన్నారు.


కోటబొమ్మాళి: కొత్తపల్లి సచివాలయంలో కొత్తపల్లి, దంత, సరియాపల్లి, రామేశ్వరం సచివాలయాల పరిధిలోని వలంటీర్లను సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు 30 మంది వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేసి..దుశ్శాలువాలతో సత్కరించారు. వలంటీర్ల సేవలను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బొమ్మాళి రాము, పిట్ట శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు పంకు రాము, కార్యదర్శులు కె.కృష్ణారావు, నరేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు దుబ్బ సింహాచలం, బెలమర మహేష్ పాల్గొన్నారు. అలాగే చిన్నసాన సచివాలంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ ఎల్లయ్య వలంటీర్లను సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి ఐ.చాణిక్య పాల్గొన్నారు.

కవిటి: కుసుంపురం, వరక పంచాయతీల్లో గ్రామ వలంటీర్లను సత్కరించారు. వారి సేవలను కుసుంపురం సర్పంచ్ ఊర్మిళ బిసాయి, ఎంపీటీసీ సభ్యుడు పద్మావతి కొనియాడారు. కార్యక్రమంలో శివబిసాయి, వైఎస్సార్‌సీపీ నేత నల్లాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టెక్కలి: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి నేరుగా సంక్షేమ పథకాలు అందజేయాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన గ్రామ వలంటీర్లు సంక్షేమ సారథులని కె.కొత్తూరు, చాకిపల్లి సర్పంచ్‌లు మొర్రి శంకర్, వాన తవిటయ్య అన్నారు. సచివాయం పరిధిలో ని వలంటీర్లను సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పొందర దేవి, పంచాయతీ కార్యదర్శి చంద్రరావు, వీఆర్వో జనకమోహన్, నాయకులు పి.శ్రీనివాస్ వి.అప్పన్న పాల్గొన్నారు.


కోటబొమ్మాళి: చిన్నసానలో వలంటీర్లను సన్మానించిన దృశ్యం


కవిటి: కుసుంపురంలో వలంటీర్లను సత్కరించిన దృశ్యం


టెక్కలి: వలంటీర్లతో ప్రజాప్రతినిధులు

ప్రజా సంక్షేమమే ధ్యేయం

● మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు


మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

మందస: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. హరిపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల హయాంలో ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందన్నారు. కుటుంబ పాలనలో మందస మండలం వెనుకబడి పోయిందన్నారు. గతంలో ఏ పాలకులకు చేతకాని విధంగా నేడు అభివృద్ధి జరుగుతోందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరిగిన సంక్షేమాన్ని ప్రజలు చూసి మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. హరిపురంలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. సీహెచ్‌సీ అభివృద్ధి, పూర్తిస్థాయి వైద్యులు, డయాలసిస్ కేంద్రం, మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు, జూనియర్ కళాశాల, జగనన్న కాలనీ, రహదారులు తదితర పనులు చేశామన్నారు. ఉన్న ఒకటో, రెండు పనులను కూడా పూర్తి చేస్తామన్నారు. తొలుత అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అప్పలరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. అలాగే జగనన్న లేఅవుట్ వద్ద ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. సర్పంచ్ జగన్నాథపురం పురుషోత్తం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, మహిళా అధ్యక్షురాలు బల్ల లీలాకుమారి, ఎంపీటీసీ సభ్యుడు ఆనల అప్పన్న, ఎంపీడీవో వాయలపల్లి తిరుమల రావు, తహసీల్దార్ బడే పాపారావు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు గార రామ్మోహనరావు, జి.ప్రసన్నకుమార్, నాయకులు మావుడెల్లి శ్రీరాములు, మట్ట ఖగేశ్వరరావు, పసుపురెడ్డి రాము, ఎం.జనార్ధన, పి.ప్రభావతి, టి.వాసుదేవు, తిరుమరెడ్డి కృష్ణారావు, కణగల ఈశ్వరరావు, ఎస్.మార్కండేయులు, ఎం.బాలయ్య పాల్గొన్నారు.

ఘనంగా సిరిమాను ఉత్సవం


దేవుపురంలో సిరిమాను ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు


హరిదాసుపురంలో సిరిమాను వద్ద ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

నందిగాం: హరిదాసుపురం గ్రామంలో అసిరి పోలమ్మతల్లి, దేవుపురంలో వెలగపోలమ్మ తల్లి సిరిమాను ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున సిరిమాను ఊరేగింపు నిర్వహించారు. హరిదాసుపురంలో పూజారి కంచరాన పోలయ్య, దేవుపురంలో కంచరాన భాస్కరరావులు సిరిమానును అధిరోహించారు. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దేవుపురంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, స్థానిక సర్పంచ్ విశ్వశాంతిచక్రవర్తితో కలిసి కొబ్బరికాయ కొట్టి సిరిమానోత్సవాన్ని ప్రారంభించగా, హరిదాసుపురంలో సర్పంచ్ కణితి ధనలక్ష్మి ప్రారంభించారు. హరిదాసుపురంలో పూజారి ఇంటి వద్ద ఉన్న అమ్మవారి ప్రతిరూపమైన దేవరను మంత్రి అప్పలరాజు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి దర్శించుకున్నారు.

అన్నార్తులకు అండగా..


కాశీబుగ్గ: జోగారావుకు సాయాన్ని అందజేస్తున్న పూర్వవిద్యార్థులు


వజ్రపుకొత్తూరు రూరల్: బాండ్ అందజేస్తున్న స్నేహితులు


సంతబొమ్మాళి: సాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

కాశీబుగ్గ: బొడ్డపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు తోటి స్నేహితుడు కష్టాల్లో ఉన్నారని తెలుసుకుని అండగా నిలిచారు. కష్టాల్లో ఉన్న మద్దిల జోగారావును మంగళవారం పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. పూర్వ విద్యార్థులు సంధ్య, స్వరాజ్యం, ఈశ్వరి, కైలాస్, తాతారావు, కృష్ణమూర్తి, కేశవ, సింహాచలం, కమల ఉన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993-94లో టెన్త్ చదువుకున్న మడ్డు భాస్కరరావు ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. రూ. 70 వేలు సేకరించారు. ఆ మొత్తాన్ని ఫిక్సిడ్ డిపాజిట్ చేసి సంబంధిత బాండును కుటుంబ సభ్యులకు అందించారు. కుమార్తె మడ్డు చాందిని చదువుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కామేశ్వరరావు, సంహాచలం, శ్రీను ఉన్నారు.

సంతబొమ్మాళి: శ్రీకాకుళం మండలం కళ్లేపల్లి గ్రామానికి చెందిన గుడ్ల బాలకృష్ణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న సంతబొమ్మాళి మండలంలోని కాపుగోదాయవలసకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ. 20 ఆర్థిక సాయం అందజేశారు. సభ్యులు అంగ జనార్దన్, ధనుంజయ ఉన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే నేరం


కాశీబుగ్గ: మాట్లాడుతున్న ఆర్డీవో సీతారామమూర్తి


వజ్రపుకొత్తూరు రూరల్: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ చేస్తున్న కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని పలాస ఆర్డీవో అమరాల సీతారామమూర్తి అన్నారు. మల్టీ మెంబర్స్, ప్రైవేటు అథారిటీ సభ్యులతో తన కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. లింగ నిర్ధారణ కోసం స్కానింగ్ చేస్తే ఆస్పత్రులు, వైద్యుల రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ట్రైనింగ్ డాక్టర్ ఎం.ఎ.అంబరీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ క్లినిక్‌లో బర్త్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సమావేశంలో వైద్య సిబ్బంది బోనెల గోపాల్, ఎస్.కరుణమ్మ, వి.సునంద, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని అక్కుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధీర్ అన్నారు. గోవిందపురం పీహెచ్‌సీ పరిధిలోని కొత్తపేటలో పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ 1994పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రకళ, ఉషారాణి, అన్నపూర్ణ ఉన్నారు.